
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 28 నవంబరు 2024



న్యూస్ బాక్స్

విద్యార్థుల క్షేత్ర సందర్శన

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల క్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా మల్యాలలోని వాగ్దేవి విద్యాసంస్థల విద్యార్థులు బుధవారం మల్యాల మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా యార్డులో రైతులకు అందించే సేవల గురించి తెలుసుకున్నారు. అక్కడి రైతులతో మాట్లాడి వ్యవసాయం గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. అలాగే మల్యాల క్రాస్‌రోడ్డు వద్దగల ఆల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు జగిత్యాలలోని కరూర్ వైశ్య బ్యాంక్‌ను సందర్శించి బ్యాంకు సేవలను తెలుసుకున్నారు. నరేశ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రాయికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జైపాల్ రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ టైమ్‌లో సమర్పించిన డాక్యుమెంటేషన్ డాక్టర్స్, సిబ్బంది అందించిన వివరాల ప్రకారం అందుబాటులో ఉన్నారా, లేదా అని పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కస్తూరి సతీష్ పాల్గొన్నారు.

నక్షాతో పట్టణానికి రక్ష



- గృహాలు, ఆస్తుల గుర్తింపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైలట్ సర్వే
- దేశ వ్యాప్తంగా 100 పట్టణాల్లో..రాష్ట్రంలో 8 చోట్ల
- పైలట్ జాబితాలో జగిత్యాల మున్సిపాలిటీకి చోటు
- త్వరలో డ్రోన్లతో ఫోటోలు, సమగ్ర సర్వేకు కసరత్తులు

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు మాదిరిగానే పట్టణాలకు సైతం నక్షా పటాలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైలట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమం చేపట్టగా...తొలి విడతలో దేశ వ్యాప్తంగా 100 పట్టణాలో, రాష్ట్ర వ్యాప్తంగా 8 పట్టణాలకు నక్షా సర్వే నిర్వహించి పటాలు రూపొందించాలని నిర్ణయించారు. అందులో జగిత్యాల మున్సిపాలిటీకి అవకాశం దక్కింది. ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణలు కూడా తేలనున్నాయి. నక్షా పటాలతో ఇండ్లు, ఆస్తులకు రక్షణ ఉంటుందని సర్వే ఆఫ్ ఇండియా అధికారులు చెబుతున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన జిల్లాలోని జగిత్యాల మున్సిపాలిటీలో నక్షా సర్వే నిర్వహించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

సాగు భూముల మాదిరిగా... పట్టణ భూములకు సైతం...

సాధారణంగా సాగు భూములకు నక్షా పటాలు ఉంటాయి..అందులో భూములకు సరిహద్దులు, దారులు, బావులు, సర్వే నంబర్లు ఇలా సమాచారం అంతా ఆ నక్షా పటాల్లో ఉంటుంది. నక్షా పటాల ఆధారంగానే సాగు భూముల సర్వే నిర్వహిస్తుంటారు. సాగు భూములకు ఉన్నట్లుగానే..పట్టణాలకు సైతం నక్షా పటాలు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. అందులో భాగంగా పైలెట్ సర్వే చేపట్టాయి. ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో సర్వే చేసేందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. జగిత్యాల మున్సిపాలిటీల్లో సమగ్ర సర్వే నిర్వహించి..పట్టణంలోని గృహాలు, ఆస్తులకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలతో పటాలు తయారు చేయనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా, మున్సిపల్, భూమి కొలతలు, రికార్డుల నిర్వహణ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా ఈ పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (ఎన్ఏకేఎస్‌హెచ్ఏ-నక్షా) కింద జగిత్యాల పట్టణానికి నక్షాలను రూపొందించనున్నారు.

విడతల వారీగా అన్ని మున్సిపాలిటీల్లో...

జిల్లా వ్యాప్తంగా 5 మున్సిపాలిటీలున్నాయి. జిల్లాలో ఓ వైపు పట్టణాలు విస్తరిస్తుండగా ఆక్రమణలు సైతం పెరుగుతున్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీల్లో ప్రభుత్వ స్థలాలు దాదాపుగా కబ్జాకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల్లో నక్షా ద్వారా సమగ్ర సర్వే చేపట్టి వాటి రక్షణకు చర్యలు తీసుకోనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగించనున్నాయి. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన జగిత్యాల పట్టణంలో సర్వే పూర్తయిన తరువాత అన్ని మున్సిపాలిటీలో ఈ సర్వే చేపట్టనున్నట్లు అధికారులు అంటున్నారు.

(తరువాయి 8వ పేజీలో)

డీఈవోగా రాము బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డీఈవో రామును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారిగా కెలివత్ రాము నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జగిత్యాల డీఈవో జగన్ మోహన్ రెడ్డిని బదిలీ చేస్తూ ఆయన స్థానంలో రాము నాయక్‌ను ఉన్నతాధికారులు నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన జగిత్యాలలో విద్యా శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాము నాయక్‌ను పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనంద రావు, యాల్ల అమర్‌నాథ్ రెడ్డిలతో పాటు ఉపాధ్యాయ సంఘ నాయకులు బోనగిరి దేవయ్య తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించడంతో పాటు శాలువలతో సత్కరించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్ రావు

జగిత్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో బుధవారం విద్యాసాగర్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు 29న జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ సలీం ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నట్లు వివరించారు. ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన తెలంగాణ పోరాటం అలు పెరుగని పోరాటమని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బాపు రెడ్డి, సతీష్, శివ కేసరిబాబు, రాజేష్, నరేందర్ రెడ్డి ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా 15ఫైనాన్స్ నిధులు 20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం పొలాస పౌలస్తేశ్వరాలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె దవాఖానాలతో ప్రజలకు వైద్యం మరింతచేరువవుతుందన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత మందులు వాడటం కన్నా వ్యాధిరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు నిత్యవాయామం, యోగకాలినడకతో ఆరోగ్యం కాపాడుకోవచ్చునన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి అత్యధికంగా 29 పల్లె దవాఖానాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపట్ల ప్రత్యేక దృష్టిసారించిందని, ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని, చైర్మన్ అన్వేష్‌రెడ్డితో మాట్లాడానని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లావైద్యాధికారి ప్రమోద్, జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, ఏఇరాజ మల్లయ్య ఏపీఎం గంగాధర్, గ్రామ మండలనాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌కే కళాశాలలో ఓరియంటేషన్



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి శివారులో గల వీఆర్‌కే ఫార్మసీ కళాశాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓరియేంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల పరిచయ కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని అందుకు ఎంచుకున్న విద్యను ఏకాగ్రతతో అభ్యసించాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రహ్మాన్ షరఫ్ అన్నారు. డాక్టర్ రామకృష్ణ దండు, డాక్టర్ పి.శశిధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వర్, ఏవో మీర్ కాజీమ్ అలీతో పాటు భోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల సందడి

- భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పూజలు

7



ధర్మపురిలో స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

కళలకు నిలయాలు... ఆ పల్లెలు

- కళ్లముందు కట్టిపడేస్తున్న రంగస్థలం కళాకారులు
- సినీ, నాటక రంగంలో రాణిస్తున్న గోదూర్, వేములకుర్తి గ్రామస్థులు

7



రంగస్థలంపై అలరిస్తున్న గోదూర్ కళాకారులు

ఆయిల్‌పామ్ దగ్ధం

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలోని దమ్మ మల్లిక అనే మహిళ రైతుకు చెందిన 4 ఎకరాల ఆయిల్‌పామ్ తోట బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆయిల్‌పామ్ సమీపంలోని రైతులు వరికొయ్యలు కాల్చడానికి నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి తోట దగ్ధమైందని భాధితురాలు ఆరోపించింది. ఆయిల్‌ఫామ్ ధహనానికి పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం తమను ఆదుకోని నష్టపరిహారం చెల్లించాలని మల్లిక విజ్ఞప్తి చేసింది. ఈ సంఘటనపై జగిత్యాల రూరల్ స్టేషన్‌లో భాదితురాలు మల్లిక ఫిర్యాదు చేసింది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బీర్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవేణి గూడెం బాలుర హాస్టల్‌లో బుధవారం డాక్టర్ శివ కుమారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 62 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హాస్టల్ వసతి, భోజన వసతిని తనిఖీ చేశారు. సీహెచ్‌వో కుద్దుష్, హెచ్ ఎస్‌లు కిషోర్, తారా, భారతి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తేమ వచ్చిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి తేమ వచ్చిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం ఎంత మొత్తంలో వస్తుందని, ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని పరిశీలించారు. ప్రస్తుతం ధాన్యాన్ని ఎంత వరకు కొనుగోలు చేశారని, ఇంకా ఎంత వరకు కొనుగోలు చేయాలని అధికారులను వివరాలు అడిగి ఆయన తెలుసు కున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న రూ 500 బోనస్ ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ఎప్పటికప్పుడు వారి బ్యాంక్ ఖాతాలో బోనస్ జమ చేయాలని ఆదేశించారు. మిగతా రైతులకు ప్రభుత్వ సెంటర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి వేగవంతంగా రైస్‌మిల్‌కు తరలించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మదుసూదన్, డీఆర్‌డీవో రఘువరణ్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ కార్యదర్శి భూమన్న, ఎంఏవో సిందూజ, ఆర్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

జగిత్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో బుధవారం తేజస్ పౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిదిగా ప్రసాద్ హాజరై మాట్లాడుతూ సమస్య వచ్చి నపుడు సామరస్యంగా పరిష్కరించుకునే దిశగా ప్రతి ఒక్కరూ వ్యవహించాలన్నారు. సమాజంలో స్త్రీ పాత్ర అత్యున్నతమైనదని పేర్కొన్నారు. సైబర్ క్రైం నేరాలు ఎక్కువగా అవుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్, ముఖ్య సలహాదారుడు హరి అశోక్ కుమార్, సీడీపీవో మమత ఉన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా జగిత్యాల

జగిత్యాల అర్బన్: బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్ అన్నారు. బుధవారం సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహం భారత్‌కు మద్దతుగా పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ అనేది జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్‌లో భాగమని, ఇది బాలల రక్షణ హక్కుల కోసం పని చేస్తున్న 250కి పైగా ఎన్‌జీవోలలో ఒకటన్నారు. డీడబ్ల్యూవో నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ అలియా, సఖి అడ్మిన్ లావణ్య, జిల్లా బాల రక్షణాధికారి హరీష్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మమత, హబ్స్ కో ఆర్డినేటర్ అశ్విని, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రవణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి..

- పాఠశాలల విద్యార్థులతో అధ్యాపకుల సమావేశం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య అందిస్తామని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చేరి విద్యనభ్యసించాలని మల్యాల జూనియర్ కళాశాల అధ్యాపకులు పదవ తరగతి చదుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్ చదివే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో బుధవారం సమావేశం అయ్యారు. ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, నవాబు, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు విద్యార్థులతో సమావేశమైన వారిలో ఉన్నారు

అర్హులు బీమా చేయించుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ మధుసూధన్

కొడిమ్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మదుసూధన్ కోరారు. బుధవారం మండలంలోని సూరంపేట గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం ఆధ్వ ర్యంలో దేశ వ్యాప్తంగా అక్టోబరు 15 నుంచి జనవరి 15వ రకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపిసుందన్నారు. 18 సంవత్సరాలు నిండి 70లోపు వయస్సు గల వారు ఏదేని బ్యాంక్, పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా కలిగి ఉండి ప్రధాన మంత్రి బీమా జీవన జ్యోతి, బీమాయోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో బీమా చేయించుకోవాలన్నారు. గంగారాం తండా లౌడ్యా రాజయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సురక్షా బీమా యోజన కింద రెండు లక్షల రూపాయల చెక్‌ను నామినికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు శంకర్, నరేష్, వివిద మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

గొల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తూడి రాజయ్య (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గేదెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లి మళ్లీ రాలేదు. కుటుంబసభ్యులు భయాందోళన చెంది అతడి కోసం గ్రామంలో గాలించారు. చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. చివరికి పక్కనే ఉన్న రంగదాముని పల్లె చెరువులో నుంచి పోతున్న ఎస్సారెస్పీ 83/ఏ ఉప కాలువలో అతడి మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానికులు రాజయ్య మృతదేహం గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చేపలు పట్టేందు కు తెప్పపై వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి వ్యక్తి..

శంకరపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఊకంటి పరబ్రహ్మం (55) అనే వ్యక్తి కేశవపట్నం గ్రామపంచాయతీ సమీపంలోని మురికికాలువలో పడి బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఇతనికి ఇల్లు, భార్య పిల్లలు లేరు. గ్రామపంచాయతీ ఆవరణలోనే ఉండేవాడు. పలువురు, బంధువులు పరబ్రహ్మం అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

వీర్నపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లికి చెందిన ఈసంపల్లి ఆశిష్ (19) గత నెల ఒకటో తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సుమారు రెండు నెలలు ఆస్పత్రిలోనే చికిత్స పొందాడు. బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోనరావుపేట నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలోని అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన గజ్జల అజయ్‌కుమార్ (28) ద్విచక్రవాహనంపై మరిమడ్ల నుంచి తాటిపెల్లికి వెళ్తున్నాడు. రోడ్డుపక్కన ఉన్న ట్రాక్టర్ ట్రాలీ కల్టివేటర్ ఢీకొట్టాడు. దీంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధినిమిత్తం దుబాయ్‌లో ఉంటున్న అజయ్‌కుమార్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మరో 20 రోజుల తర్వాత దుబాయ్‌కి వెళ్లాల్సి ఉంది.




- కళాభారతిలో నూతన హంగులు
- త్వరలో అందుబాటులోకి రానున్న వేదిక

కొత్త కొత్తగా..

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్రకు, కళాకారులకు, కళలకు వారధి.. సంగీత, సాంస్కృతిక సాహిత్య కళా రాజకీయ వేదికలకు పెన్నిధి... కరీంనగర్ కళాభారతి. కరీంనగర్ కళా కిరీటంలో కలికితురాయిగా నిలిచి ఎందరో మహనీయులుగా అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేసిన జిల్లా కేంద్రంలోని 'కళాభారతి' కొంత కాలంగా కళ తప్పింది. అధికారులు ఇటీవల నిధులు మంజూరు చేయడంతో నూతన హంగులతో ప్రజల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సృజనకారులు, కళాకారులు, నాయకులు, అధికారులు, ప్రజలు, సమావేశ కర్తలను వేదికగా నిలిచిన కళాభారతి కొద్ది కాలంగా నిర్లక్ష్యానికి గురవుతోంది. నేడు ఊడిన పైకప్పు పెచ్చులు... మరో వైపు విరిగిన కుర్చీలు.. ఇంకో వైపు కుంగిన వేదిక.. వెక్కిరిస్తున్న వసతులు... ఇలా శిథిలమై కనిపిస్తుంటే కళాకారుల గుండె తరుక్కుపోయేది. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం కళాభారతి రూపురేఖలు మారుతున్నాయి. గతవైభవం సంతరించుకునేలా కళాకారులు, సాహిత్యకారులు, కళాభిమానుల కోసం అధునాతన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాభారతిని సందర్శించి రూ. 11 లక్షలతో స్టేజ్ వాల్, సౌండ్ ప్రూఫ్ ఎకోస్టిక్, రూఫ్ షీట్స్, డ్రెస్సింగ్‌రూంలు, తెరలు, సీలింగ్, కుర్చీల మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, కళాభారతికి మరోద్వారంతో పాటు మినీ పార్క్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మేయర్ సునీల్‌రావు కూడా ఆధునీకరణ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. పునర్నిర్మాణ పనులు ఆలస్యం అయి



నా ఆ తర్వాత పనులు వేగవంతం కావటంతో నూతన హంగులతో కళాభారతి త్వరలోనే మన ముందుకు రాబోతున్నది.

ఏదిఏమైనా కళాభారతి పునఃప్రారంభోత్సవంపై కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ కళా ప్రదర్శనలకు కళాసంస్థలు, కళాకారులు సిద్ధమవుతున్నారు. ఓ అధునాతన నూతన జనరేటర్ సమకూర్చితే బాగుంటుం దని, ఒక్కోసారి కరెంట్ పోవడంతో ప్రదర్శనకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని కళాకారులు పేర్కొంటున్నారు.

- ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఘంటసాల నుంచి గద్దర్ వరకూ, కాంతారావు నుంచి నేటి నటీనటుల వరకు, ఎంఎస్ సుబ్బలక్ష్మి నుంచి నేటి కళాకారుల వరకు శ్రీశ్రీ, విశ్వనాథ, సినారె నుంచి ఈనాటి కవుల వర కు, గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అందరూ కళాభారతి వేదికనెక్కిన వారే.

ఇదీ మన కళాభారతి చరిత్ర

1974లో మున్సిపల్ చైర్మన్ నరహరి లక్ష్మన్ ఉన్న కాలంలో స్వతహాగా నటుడైన కళా పోషకుడు కమిషనర్ గౌస్‌మొహినోద్దీన్ కళాభారతిని ప్రారంభించారు. సుమారు 8 గుంటల స్థలంలో ఉన్న దీన్ని ఆ కాలంలో టౌన్ హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కెఎస్ శర్మ దీన్ని కళాభారతిగా నామకరణం చేశారు. నాటి కాలంలో ఈ కళాభారతి కార్యక్రమాలకు సరిపడదని భావించి ప్రస్తుత కళాభారతి వెనుక భాగంలో బహిరంగ కళావేదిక ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కళాభారతి మున్సిపల్ ప్రాపర్టీ కింద పడిపోయింది.

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 6,950 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 183 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13 క్వింటాళ్ల గోనే సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,950 రూపాయలు, కనిష్ఠ ధర ఆరు వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధర ప్రకారం 3,500 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు చేపట్టింది.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గ్రౌండ్ పరిశీలన

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 29నుంచి జరిగే అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు జరిగే స్థలాన్ని క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 9వ తేది నుండి ఫొటోగ్రాఫీ అండ్ వీడియోగ్రఫి (పురుషులు) 30 రోజుల ఉచితశిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతం వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 9849411002, 7981151653 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన వ్యక్తికి ఏడాది జైలు

మల్లాపూర్, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన కేసులో నిందిడుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ మెట్‌పల్లి న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. 2019లో ముత్యంపేటలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎండీ జమీల్‌ను ఖాజాఖాన్ అనే వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు. విచారణ చేపట్టిన అప్పటి ఎస్సై రవీందర్ కేసు నమోదు చేశాడు. ఖాజాఖాన్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సాయిని మల్లేశ్వరీ అనే వృద్ధురాలిని బుధవారం పోలీసులు కాపాడారు. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని ద్వారక గ్రామానికి చెందిన మల్లేశ్వరీ అనే వృద్ధురాలు ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకుందామని రాయపట్నం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చింది. బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నం చేస్తుండగా అక్కడే చెక్‌పోస్టు వద్ద ఉన్న పోలీసులు గమనించారు. వెంటనే ఆమె ప్రాణాలు కాపాడి శెకెల్ల గ్రామంలో ఉన్న ఆమె కూతురు కొత్త లలితకు సమాచారం అందించారు. వృద్ధురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ ఆమె కూతురు లలితకు అప్పగించారు.

సీఈఐఆర్ ద్వారా 162 మొబైల్ ఫోన్ల రికవరీ

- సీసీఎస్ ఏసీపీ కాశయ్య



బాధితులకు మొబైల్‌ఫోన్లను అందజేస్తున్న సీసీఎస్ ఏసీపీ కాశయ్య

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ విధానం ఉపయోగించి కమిషనరేట్ వ్యాప్తంగా కొద్ది నెలల క్రితం పోగొట్టుకున్న 162 మొబైల్ ఫోన్లను గుర్తించిన సైబర్ క్రైం, సీసీఎస్ పోలీసులు బాధితులకు అప్పగించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు మొబైల్ ఫోన్లను అందించారు. అనంతరం విలేకరులకు సీసీఎస్ ఏసీపీ పి కాశయ్య వివరాలను వెల్లడించారు. 2023 ఏప్రిల్‌లో సీఈఐఆర్ విధానాన్ని ఉపయోగిస్తున్నామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు బాధితులకు 1206 మొబైల్‌ఫోన్లను గుర్తించి అందజేశా మన్నారు. సీఈఐఆర్ ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌లను గుర్తించడం సులభం అవుతుందని తెలిపారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధి తులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లేదా సంబంధిత పోలీసు ఠాణాలో ఫిర్యాద చేయాలన్నారు. ఇదివరకే ఇతరులు ఉపయోగించిన ఫోన్లను కొనుగోలు చేసేవారు ఆ ఫోన్‌ల ఐఎంఈఐ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి చెక్ చేసుకుంటే ఆ ఫోన్ స్టేటస్ తెలుస్తుందని ఏసీపీ కాశయ్య ప్రజలకు సూచించారు. ఏ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్ అయినా సీఈఐఆర్ విధానంతో ఆ ఫోన్ ఎవరి వద్ద ఉన్నా పనిచేయకుండా చేయవచ్చన్నారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న 50 సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి బాధితులకు బుధవారం ఏసీపీ శ్రీనివాస్‌జీ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చాలా మంది ఫోన్లు పొగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ సిబ్బంది ఆచూకీ కనుకొన్నారన్నారు. అనంతరం 50 మంది బాధితులకు సెల్‌ఫోన్లను అందించారు. తమ సెల్‌ఫోన్లు అందించినందుకు బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, రవి, కిశోర్, ఎస్‌ఐలు తిరుపతి, రాజకుమార్ పాల్గొన్నారు.

రామడుగు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గంటే మునిందర్, పందికుంట గ్రామానికి చెందిన బండ్ల రాంచరణ్ ఇటీవల తమ మొబైల్ ఫోన్‌లను పొగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ శేఖర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేయించి బుధవారం బాధితులకు అందజేశారు. ఫోన్‌ల రికవరీలో కీలకపాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ భూమయ్యను ఎస్‌ఐ ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్, అమ్మకం

- నిందితుడిని అరెస్టు చేసిన రూరల్ సీఐ


నిందితుడు పుట్టపాక శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన మహిళ పేరిట ఉన్న స్థలాన్ని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని మరొకరికి విక్రయించిన కేసులో నిందితుడిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన సామిండ్ల పద్మప్రియ అనే మహిళ 2008లో మరణించింది. ఆమె పేరిట గ్రామంలో ఆరు గుంటల స్థలం ఉంది. ఆమె కుటుంబసభ్యులకు తెలియకుండా 2013లో కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన పుట్టపాక శ్రీనివాస్ అనే వ్యక్తి తనపేరిట తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వేరొక మహిళ పేరిట తప్పుడు గుర్తింపుకార్డును తయారుచేసి ఆమెను పద్మప్రియగా చూపించి అక్రమంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తరువాత ఆ స్థలాన్ని మరికొంద రికి విక్రయించాడు. స్థల యజమాని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉండటంతో వారికి ఈ విషయం తెలియలేదు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ నిందితుడైన పుట్టపాక శ్రీనివాస్‌ను గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. కాగా నిందితుడు పుట్టపాక శ్రీనివాస్‌పై కరీంనగర్‌లోని మూడు పట్టణ పోలీసు ఠాణాలతో పాటు కరీంనగర్ రూరల్ ఠాణాలో కూడా పలు చీటింగ్ కేసులు నమోదయ్యాయని సీఐ తెలిపారు.

హార్వెస్టర్‌లో మంటలు.. తప్పిన పెను ప్రమాదం

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం వరంగల్ రోడ్‌లోని ఓ మెకానిక్ షాప్‌లో పెను ప్రమాదం తప్పింది. చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన కోమల్‌రెడ్డి హార్వెస్టర్ రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దేవాలయంలోని సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి ఉత్సవ పంచలోహ విగ్రహాలను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయారు. ఉత్సవ విగ్రహాలతో పాటు ఆలయంలోని వెండి దీపాలు, శఠగోపం, కిరీటంను కూడా దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు ఆలయ పూజారి రామరాజేశ్వరశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూజారి మంగళవారం పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం 5:30 గంటలకు గుడికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయం లోపలికి వెళ్ళి చూడగా నాలుగు పంచలోహ ఉత్సవ విగ్రహాలు, వెండి వస్తువులు కనపడలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పంచలోహ విగ్రహాల విలువ 55 వేలుంటుందని, వెండి పూజా వస్తువుల విలువ 15వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉత్సవవిగ్రహాలు ఎత్తుకుపోయింది దొంగలేనని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. మహాలక్ష్మినగర్‌లోని వెంకటేశ్వర దేవాలయంలో మూడురోజుల కిందట కలశాలు, సామాగ్రిని దొంగలు ఎత్తుకుపోయారని దేవాలయనిర్మాత అశోక్‌రావు తెలిపారు.



ఆలయం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు

యువకుడి మృతదేహం లభ్యం

గంభీరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో మంగళవారం దూకిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఎల్పుగొండకు చెందిన భరత్‌కుమార్ (31) మృత దేహం బుధవారం లభ్యమైంది. గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మృతుడు భరత్ కుమార్‌కు 11 నెలల కిందట వివాహమైంది. కొద్ది రోజులుగా భరత్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయాడు. బాధలు భరించలేకనే మంగళవారం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో దూకాడు. గజ ఈతగాళ్ల సహాయంతో భరత్ మృతదేహాన్ని మానేరు నుంచి బుధవారం బయటకు తీశారు. భరత్‌కుమార్ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో చోరీ

- 2.5 తులాల నగలు, రూ.50 వేలు అపహరణ


బీరువాను పరిశీలిస్తున్న సీసీఎస్

జ్యోతినగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో మంగళవారం చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 50 వేల రూపాయల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బైరి సుస్మిత అనే మహిళ తన 10 ఏళ్ల కూతురుతో అన్నపూర్ణకాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నది. మూడేళ్ల క్రితం ఆమె భర్త చనిపోగా, కూతురుతో కలిసి ఉంటోంది. సుస్మిత ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఓ మాల్‌లో పనిచేస్తోంది. మంగళవారం తన కూతుర్ని స్కూల్‌కు పంపి మాల్‌కు వెళ్లింది. సాయంత్రం తన కుమార్తె ఇంటికి వస్తుందనే ఉద్దేశంతో ఇంటి తాళంచెవి కిటికీపై పెట్టింది. ఈక్రమంలో దొంగలు తాళంచెవితో ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, 50 వేల రూపాయలను అపహరించారు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీ జరిగిన ఇంటిని ఎన్టీపీసీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసం దగ్ధం

మానకొండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో పశుగ్రాసంతో వెల్లుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన జింక రాజయ్య అనే వ్యక్తి బుధవారం తన ట్రాక్టర్‌లో కరీంనగర్ మండలంలోని చింతకుంట గ్రామానికి పశుగ్రాసాన్ని తరలిస్తున్నాడు. మండలంలోని గంగిపల్లి గ్రామంలోని బస్టాండ్ వద్దకు రాగానే ట్రాక్టర్‌లోని పశుగ్రాసానికి విద్యుత్ వైర్లు తాకి మంటలు లేవగా డ్రైవర్ ట్రాక్టర్‌ను నిలిపివేశాడు. గ్రామస్థుల సహయంతో ట్రాక్టర్‌లోని గడ్డి కట్టలను కర్రల సహయంతో కిందికి తీసివేయడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.


సిరిసిల్ల శివనగర్ పాఠశాలలో విద్యార్థులకు అటల్ టింకరింగ్ శిక్షణ

బాలలు.. భావి శాస్త్రవేత్తలు

- ఆలోచింపజేస్తున్న విద్యార్థుల ఆవిష్కరణలు
- ఇన్‌స్పైర్ మనక్‌తో ప్రోత్సాహం
- అటల్ టింకరింగ్‌లో ల్యాబ్‌లో శిక్షణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తి కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆవిష్కరణలతో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందిస్తూ శాస్త్ర వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్‌లో నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తున్నారు. నాలుగేళ్ల క్రితం పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ అటల్ టింకరింగ్‌లో విద్యార్థులకు శిక్షణను అందిస్తూ నూతన ఆవిష్కరణలను తయారు చేయిస్తున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జక్కని హేమంత్ తయారు చేసిన పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ మిషన్ 2022-23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మానక్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. పదోతరగతి చదువుతున్న మరో విద్యార్థి సీహెచ్ శివతేజ డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాడు. విద్యార్థిని కుమ్మరికుంట నిహారిక మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ పరికరాన్ని ఆవిష్కరించింది.


ఫోల్డింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

క్లాత్ ఫోల్డింగ్ యంత్రం తయారు చేశా
జక్కని హేమంత్ విద్యార్థి



పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ యంత్రాన్ని తయారు చేశాను. జాతీయ స్థాయికి ఎంపికైంది. మరింతగా ప్రోత్సహిస్తే మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

పరికరాలను తయారీ నేర్చుకున్నా
నిహారిక, 10వ తరగతి, సిరిసిల్ల



పాఠశాలలో అటల్ టింకరింగ్‌లో సైన్స్ పరికరాల తయారీపై శిక్షణ ఇచ్చారు. గతేడాది సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ యంత్రాన్ని తయారు చేశా. మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సహం
సీహెచ్ శివతేజ, 10వ తరగతి, సిరిసిల్ల



మా పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సైన్స్ పరికరాల తయారీ నేర్చుకున్నాను. నేను డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాను.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం
పాకాల శంకర్‌గౌడ్, సైన్స్ టీచర్, సిరిసిల్ల



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్ ఫిఫ్టీ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాం. స్పోకెన్ ఇంగ్లీష్ కూడా నేర్పిస్తున్నాం. విద్యార్థుల ప్రదర్శనలు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతున్నాయి.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.50 కోట్లు


రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపులో ఉద్యోగులు, సిబ్బంది

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1.50 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో 32 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఖజానాకు ఒక కోటి 50 లక్షల 24 వేల 507 రూపాయలు సమకూరగా, 170 గ్రాముల బంగారం, 9 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు


కొండగట్టులో జడ్జిని సత్కరిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి రవీందర్‌శర్మ కుటుంబ సమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ శాలువతో సత్కరించగా అర్చకులు స్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

● బుల్లితెర నటుడు, యాంకర్ బత్తిరి సత్తి అలియాస్ రవికుమార్ కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు. భారతపు శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రముఖ కమేడియన్, టీవీ యాంకర్ బిత్తిరి సత్తి బుధవారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలు

భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట లో ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీంనగర్ పేట టీఎస్ అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కరీంనగర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జి శ్రీను, ఎండి యూనిస్ పాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్, వీరన్న, శంకరయ్య, భక్తు రాజ్‌కుమార్, మహేష్, సంతోష్, రాజబాబు, రజనీ, సౌజన్య శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయాలు ఆ పల్లెలు

- కళ్లముందు కట్టిపడేస్తున్న రంగస్థలం కళాకారులు
- సినీ, నాటక రంగంలో రాణిస్తున్న గోదూర్, వేములకుర్తి గ్రామస్థులు
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గుర్తింపు
- అటు రంగ స్థలంలోనూ... ఇటు వెండి తెరపైననూ...
- దాదాపుగా ఇంటికో కళాకారుడు... కళాభిమానులు


రంగస్థలంపై గోదూర్ కళాకారుల ప్రదర్శన

ఇబ్రహీంపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక జీవితంలో బాలీవుడ్, టాలీవుడ్, హాలీవుడ్ సినిమాలతో పాటు ప్రపంచం నలు మూలల నుంచి ఎది చూడాలనుకున్నా అరచేతిలో ఫోన్‌లో చూసేస్తున్నాం. కానీ రెండు దశాబ్దాల క్రితం స్మార్ట్ ఫోన్ రాకముందు వినోదం కావాలంటే ఖసీర్ వద్దకు వెళ్లాల్సిందే. పల్లెటూరు నుంచి పట్నం వరకు ఆనాడు వీధి నాటకాలు, రంగస్థలాలో నాటికలు, పలు సాంస్కృతిక నృత్యాలు వేస్తే చాలు ప్రజలు గుమిగుడి ఎంజాయ్ చేశారు. అలాంటి కళలకు నిలయాలుగా ఆ పల్లెలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.... కళాకారులకు అడ్డాగా ఆ రెండు గ్రామాలు వర్ధిల్లుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాల్లో వర్ధిల్లుతున్న కళారంగంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

కళలకు పుట్టినిల్లుగా గోదూర్..

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో దాదాపుగా కళాకారులు, కళాభిమానులున్నారు. దాదాపుగా వంద సంవత్సరాలుగా కళలకు పుట్టినిల్లుగా గోదూర్ గుర్తింపును సొంతం చేసుకుంది.

పలు సందర్భాల్లో పలు ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జానపద ప్రదర్శనలు, నాటిక పోటీల్లో పాల్గొని శభాష్ అనిపించుకుంటున్నారు. నాటికలకు తోడు యక్ష గాణాలు, వీధి నాటికలు, హరికథలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలు ప్రదర్శిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. గోదూర్‌లో ప్రస్తుతం దాదాపుగా సుమారు వంద మంది కళాకారు లున్నారు. గ్రామానికి చెందిన కోటగిరి మురళీ అలియాస్ గోదూర్ మురళీ సినీ రంగంలోనూ రాణిస్తూ మన్ననలు పొందుతున్నారు. కాయితి చంద్రశేఖర్, చల్ల దేవదాసు, కోటగిరి వెంకటస్వామి, రంగయ్య, చెట్ల శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ మూర్తి, దక్షిణ మూర్తి, తదితరులు రంగస్థల నటనలో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. గోదూర్ కళాకారులు నటించిన 'రుద్రవీణ', 'రాయి', 'చెల్లని పైసలు' నాటికలకు గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయి.


చిత్రీకరణ జరుపుతున్న యూనిట్ సభ్యులు

వేములకుర్తిలో ఇంటింటికో కళాకారుడు..

మండలంలోని వేములకుర్తి గ్రామంలో దాదాపుగా ఇంటికో కళాకారుడున్నాడు. వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు వెండి తెరపైనా రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన అంకతి భరత్ అను యువకుడు శ్రీ రాజన్న మూవీస్ పేరిట సొంత బ్యానర్ ఏర్పాటు చేసుకొని సినిమా నిర్మాణాలు జరుపుతున్నాడు. 'మృత్యువు', 'నేను బతికే ఉన్నాను', 'రక్షక్', 'ఇంటరాగేషన్', 'మహ కంత్రి గాళ్లు', 'వీళ్లకు అంత సీన్ లేదు', 'బాక్స్', 'మెంటల్ పోలీస్', 'పడిపోయా నీ మాయ'లో తదితర సినిమాల్లో వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు నటించారు. గ్రామానికి చెందిన రాదారపు ప్రభాకర్, మోహన్, సురేశ్, రమేశ్, కోటగిరి అశోక్, రాదారపు దేవదాసు రంగ స్థలం నటన, షార్ట్ ఫిలింస్‌లో పేరు తెచ్చుకున్నారు.


సినీ నిర్మాత దిల్‌రాజుతో వేములకుర్తి కళాకారులు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

అంకతి భరత్, సినీ కళాకారుడు, వేములకుర్తి



గ్రామీణ ప్రాంతాల కళాకారులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి. రోజురోజుకూ అంతరించి పోతున్న కళలను బతికించుకోవడానికి ప్రోత్సాహం అవసరం.

కళలకు అడ్డాలుగా గోదూర్, వేములకుర్తి

కోటగిరి చైతన్య, కళాకారుడు, గోదూర్



జిల్లాలో కళలు, కళాకారులు, కళాభిమానులకు అడ్డాలుగా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాలు గుర్తింపు పొందాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలా బాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్ తదితర జిల్లాల్లో పలు సందర్భాల్లో జరిగిన పోటీల్లో గోదూర్, వేములకుర్తి కళాకారులు రాణించి ప్రతిభను చాటుకున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న విశారదన్‌మహరాజ్

సుభాష్‌నగర్, నవంబరు 27: ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న మాభూమి పాదయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్‌మహరాజ్ కోరారు. బుధవారం నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశారదన్‌మహరాజ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం 2025 జనవరి 5న పాదయాత్ర ఆదిలాబాద్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, గృహం, భూమి ఇవ్వాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన రానందున రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్, సిరిసిల్ల బాబు, జగిత్యాల శివ, పెద్దపల్లి గణేశ్, ఉపాధ్యక్షుడు రవీందర్, బాబు, రాజేంద్ర ప్రసాద్, రాకేశ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, పి శ్రీహర్ష, వి యుక్త జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మహ్మద్ ముఫ్జాజిల్ తెలిపారు. క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

అరుణాచలం తరహాలో కొండగట్టు గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణ మార్గం కోసం మట్టి తీస్తున్న ఎమ్మెల్యే సత్యం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచలం వద్ద నిర్వహిస్తున్న తరహాలోనే కొండగట్టు అంజనేయస్వామి గుట్ట చుట్టూ గిరిప్రదక్షినకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కొండగట్టు గుట్ట చుట్టూ భక్తులు చేసే గిరిప్రదిక్షణ మార్గం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి మట్టి తవ్వారు. గిరిప్రదిక్షణ మార్గంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండగట్టులో గిరిప్రదిక్షన కోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రెండు లక్షలు రూపాయలు సొంతంగా ఇచ్చారని అందులో భాగంగా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో అంజయ్య, మల్యాల, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, రాజనర్సింగరావు, నాయకులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్, వినయ్, హరినాథ్, తిరుపతి నర్సింహరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్, మల్లేశంపాల్గొన్నారు

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టిసారించండి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టుల విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో పెండింగ్ ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోళ్ళపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాజెక్టుల భూసేకరణ విషయమే ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజీ -9, 10, 11, 12 మిగతా పనిపూర్తి చేసేందుకు కావలసిన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని, డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో రెండురోజుల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర అవసరాల మేరకు సన్నరకం ధాన్యం సేకరణ పకడ్బందీగా చేయాలని రైతుల ఖాతాల్లో రూపాయలు 500 బోనస్ పేడలా ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టల్‌లకు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చౌక ధరల దుకాణాలకు సన్న రకం బియ్యం అందిస్తామని చెప్పడం జరిగిందని అన్నారు. సన్నవడ్ల ఎక్కువ మొత్తం లో కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున కొనుగోళ్ళపై దృష్టిపెట్టాలని అన్నారు.

● 84శాతం చెల్లింపులు పూర్తి

కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 53,512 మెట్రిక్ టన్నుల సన్న రకాలు, 1,23,208 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మొత్తం 1,76,720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సుమారు 345 కోట్ల రూపాయలను చెల్లించినట్లు చెప్పారు. త్వరలోనే మిగతావి చెల్లిస్తామని అన్నారు. సన్న రకాల రైతులకు 11.18 కోట్ల రూపాయల బోనస్ చెల్లించామని తెలిపారు. మూడు రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ మొత్తంలో సన్నవడ్లు వస్తున్నాయని, నూరుశాతం కొనుగోలు పూర్తిచేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ దేవంద్రసింగ్ చౌహాన్, జిల్లా పౌరసరఫరా అధికారి నర్సింగారావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా వ్యవసాయాధికారి విజయభాగ్యలక్ష్మి, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని మహిళా శిశుసంక్షేమ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనిసెఫ్ సహకారంతో బాల్య వివాహ నిర్మూలనకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలల హాస్టల్‌లో డీసీపీవో పర్వీన్ పాల్గొని బాల్యవివాహ నిరోధక చట్టం, బాల్య వివాహాల ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, ఆ వివాహం కూడా చెల్లదని అన్నారు. బాల్య వివాహం గురించి సమాచారం ఉంటే చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 గానీ, 94908811098 నంబర్‌కు కానీ ఫోన్‌చేసి తెలపాలని అన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రమేశ్, కల్యాణి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి


గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కళ్యాణం జరిపించారు. స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు చేశారు. స్థానిక శేషప్ప కళావేదికపై బ్రహ్మశ్రీ గరిపెల్లి మహేష్‌శర్మ కార్తీక పురాణ ప్రవచనాలు చేశారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 26వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

గోదావరి మహా హారతి విజయవంతం చేయాలి

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నవంబరు 30 న శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోదావరి హారతి ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు కోరారు. స్థానిక గోదావరి నది మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద బుధవారం మహా హారతి కోసం స్థలాన్ని చూసి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరొందిన ధర్మపురి క్షేత్రంలో గత 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి, పూజ్యశ్రీ అతిథేశ్వరానంద పర్వత, గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్, బీజేపీ జాతీయ నాయకులు పోల్సానీ మురళీధర్‌రావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వైదిక స్మార్త జ్యోతిష్య పౌరాణికులు, బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్మూరి సంతోష్‌రావు తదితరులు హాజరవుతారని ఆయన వివరించారు. కావున అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేందర్‌రెడ్డి, కందాల నర్సింహమూర్తి, బండారి లక్ష్మణ్, లక్ష్మీనర్సయ్యగౌడ్, గోపి, సతీష్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య, బెజ్జారపు లవణ్, బండారి లక్ష్మణ్, దొనకొండ నరేష్, నలుమాసు వైకుంఠం, గాజు భాస్కర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, అప్పం మల్లేష్, దివిటి శ్రీధర్, పల్లెర్ల సురేందర్, కాశెట్టి హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు మోక్షమెప్పుడో..?

- ● నత్తనడకన వృద్ధుల, అనాథ ఆశ్రమ భవనాల నిర్మాణ పనులు
- ● కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు మంజూరైన ఆశ్రమాలకు మోక్షం కలగడం లేదు. రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టడానికి ఆనాటి మంత్రి, ఎమ్మెల్యే తదితరులు శంకుస్థాపనలు చేశారు. ఒక భవనం పనులు ప్రారంభమైనా అ సంపూర్తిగానే మిగిలిపోయింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనుల్లో వేగం పెంచినా ఇంకా పనులు పూర్తి దశకు చేరుకోలేదు. అనాథాశ్రమం భవన సముదాయం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంటీరియర్‌తో పాటు ప్రహరీ గోడల నిర్మాణాలు, సెప్టిక్ ట్యాంక్ వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సత్వరం పనులు చేపట్టేందుకు కలెక్టర్లు సైతం ఇక్కడి పనులను పరిశీలించారు. 24 జనవరి 2023న శంకు స్థాపనలు జరిగిన ఈ భవన నిర్మాణాలు 15 మార్చి 2024లోగా పనులు పూర్తి కావాలని కలెక్టర్ పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కానీ అవి కార్యరూపం దాల్చడంలేదు. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీ సమీపంలో పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయం పక్కన వీటి నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని మూడు పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజక వర్గాల పరిధిలోని వృద్ధులకు ఆశ్రయం కల్పించే వీలుగా వారికి అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.


ప్రారంభోత్సవానికి నోచుకోని అనాథ ఆశ్రమం

ఒకే ప్రాంగణంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

మార్కండేయ్య కాలనీలో చేపట్టిన నిర్మాణ ప్రాంతంలో ఒకే చోట పలు సంక్షేమ భవనాలతో పాటు వృద్ధాశ్రమం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయిం చారు. ఆ ప్రకారంగా నిర్మాణాలు చేపట్టినా అవి నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నియామకం

మెట్‌పల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ న్యాయవాదుల సంఘం అధికార ప్రతినిధిగా మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రిని నియామించినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై.కొండల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కోంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అదే విధంగా పార్లమెంట్‌లో అడ్వకేట్ ప్రటెక్షన్ యాక్ట్ అమలు చేసి న్యాయవాదులను ఆదుకోవాలని కోరారు.

జూనియర్ న్యాయవాదు లకు నెలకు 5 వేల స్టేఫండ్ ఇవ్వాలని కోరా రు. తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ న్యాయవా దుల సంఘం అధికార ప్రతినిధిగా మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి నియామకం కావడం పట్ల మెట్‌పల్లి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తు అభినందనాలు తెలిపారు.

రైతులకు రసీదులు ఇవ్వకపోతే చర్యలు

కథలాపూర్, నవంబరు 27 : రైతులు తమ పంట పొలాలకు రసాయనిక మందులు, ఎరువులు తీసుకున్న సమయంలో విధిగా రసీదులు ఇవ్వాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఏవో యోగిత హెచ్చరించారు. బుధవారం మండలంలోని సిరికొండలో దుర్గా, రాజరాజేశ్వర ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులు సక్రమంగా నిర్వహించ చడం లేదని డీలర్లను మందలించినట్లు ఏవో తెలిపారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలని సూచించినట్టు చెప్పారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరుకు చెందిన వై గంగాధర్ అనేవ్యక్తి తీవ్ర అనారోగ్యంకు గురికాగా శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు చెప్పడంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రు. 1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు. ఈ మేరకు నిమ్స్ ఆసుపత్రి వైద్యులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

వెల్గటూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పని చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య డిమాండ్ చేశారు. బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా కుమ్మరి పల్లి కేజీబీవీ సిబ్బంది సిబ్బంది బుధవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 27,28 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు, కేజీబీవీ సిబ్బందికి, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు. లేని పక్షంలో జనవరి 28న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దీప, పీజీ సీఆర్టీలు ఉమా, స్వాతి, శ్వేత, సుప్రియ, జ్యోతి, లావణ్య సీఆర్టీలు స్వప్న, నసీం సుల్తానా, నీతు, జయ, మమత, మౌనిక, పద్మ, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కుమ్మరిపల్లి కేజీబీవీ సిబ్బంది

పెగడపల్లి: కస్తూర్భాగాంధీ బాలికా విద్యాల యాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మిని మం టైం స్కేల్ కనీస వేతనం అమలు చేయాలని రాష్ట ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు తిరుకోవెల శ్యాంసుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులతో కలసి నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతున్నారని రోజు రోజుకు జీవితాలు భార మవుతున్నాయని, పని భారం ఎక్కువవుతున్నా జీతాలు పెరగడం లేదని ఉద్యోగులు, ఉపాధ్యాయలు వాపోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గడ్డల శ్రీధర్, మండల అధ్యక్షుడు గంగం అనీల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాస రచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కోరుట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బుధవారం ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు పునరుత్పాదక ఇందన వనరుల అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. పోటీలను ఎంఈవో నరేశం పరిశీలించి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. మొదటి బహుమతి బాలికల పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని హిమాని, రెండవ బహుమతి జిల్లా పరిషత్ పైడిమడుగు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హిమాజ, మూడవ బహుమతి కోరుట్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థికి నిలిచినట్లు మండల విద్యాధికారి నరేశం తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయులు కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రసూతి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అసుపత్రిలో ఉన్న మందుల నిలువలపై ఆరా తీసారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహిస్తున్న వెద్య సేవల గురించి కేంద్ర టెక్నీషన్లను అడిగి తెలు కోని తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, బీఆర్‌ఎస్ ఫహీం, నగేష్, ప్రభులతో పాటు నాయకుల పాల్గొన్నారు.

నక్షాతో పట్టణానికి రక్ష..

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీల్లో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు, భూముల లెక్కలు పక్కాగా రూపొందించేందుకు నక్షాలు ఆ ధారం కానున్నాయి. వివిధ శాఖల సమన్వయం తో సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్ల సాయంతో ఫోటోలు తీస్తారు. వాటిని ఆదారంగా చేసుకొని సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి ప్రతీ ఇల్లు, ఆస్థిని కొలతలు వేస్తారు. ఇళ్ల సరిహద్దులు, స్థలాల విస్తీర్ణం గుర్తించి డిజిటల్ పద్ధతిలో ఇంటర్‌నెట్‌లో నమోదు చేస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్థుల హద్దులను గుర్తిస్తారు. వాటి విస్తీర్ణతలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం ఇల్లు, ఆస్థికి ప్రాపర్టీ కార్డులు అందజేస్తారు. అపార్ట్‌మెంట్లు, శివారు కాలనీల్లో ఉన్న ఇళ్లకు పటాలను తయారు చేస్తారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాలను కూడా పటాలుగా రూపొందిస్తారు. దీంతో పూర్వ రికార్డుల్లో ఉ న్న ప్రభుత్వ భూమి, స్థలం ఆక్రమణలు బయటపడను న్నాయి. ప్రభుత్వం జారీ చేసే ప్రాపర్టీ కార్డుల ద్వారా మునుముందు బ్యాంకు రుణాలు పొందడంలో ఇబ్బం దులకు చెక్ పడనుంది.

ప్రభుత్వ స్థలాల గుర్తింపు..

నక్షా సర్వేలో ప్రభుత్వ స్థలాలు, మురుగునీటి పా రుదల వ్యవస్థ, నాలాలు, డంపింగ్ యార్డులు, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల విస్తీర్ణ కొలతలు పక్కాగా తేలనున్నాయి. వాటి హద్దులను గుర్తించనున్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాల గుర్తింపు అనంతరం అవి భూ నిధిగా ఉపయోగపడనున్నాయి. ఆక్రమణలు తేలనున్నాయి. నక్షా సర్వే ద్వారా చిన్న చిన్న పట్టణాల్లోని ఆక్రమణలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. సమగ్ర భూ నక్షా సర్వే చేయడం ద్వారా భవిష్యత్తులో భూవివాదాలకు ఆస్కా రం ఉండదని, ప్రభుత్వం ప్రాపర్టీ కార్డుల జారీ ద్వారా న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా అవలీలగా బ్యాంకు రుణాలు పొందవచ్చని రియల్ రంగ నిపుణులు అంటున్నారు.

ప్రణాళిక రూపొందిస్తున్నాము



నక్షా పటాలను రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన వి ధంగా జగిత్యాల మున్సిపాలిటీల్లో సర్వే చేపట్టేందుకు ప్రాథమికంగా కసరత్తులు చేస్తున్నాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికబద్ధంగా సర్వే చేయడా నికి ప్రయత్నాలు చేస్తున్నాము. పకడ్బందీగా నక్షా పటాల రూపకల్పన జరగనుంది.

- వెంకట్ రెడ్డి, ఏడీ, జిల్లా భూ కొలతల శాఖ, జగిత్యాల

ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

వెల్గటూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పడకల్ గ్రామానికి చెందిన ఆకుల రాజేశ్వర్ రావు, పొలాడి రామచంద్రరావు, పొలాడి రత్న షీలా అనే ముగ్గురు వ్యక్తులపై బుధవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమా సాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2015 సంవత్సరంలో గాదె లక్ష్మణ్‌కు రెండు ఎకరాల భూమి పట్టా చేయిస్తామని అతనికి వరుసకు బావ అయిన రాజేశ్వర రావు అతని వద్ద రూ.8 లక్షలు తీసుకొని తర్వాత మిగతా ఇద్దరు నిందితులతో కుమ్మక్కై సదరు భూమిని వేరే వ్యక్తులకు పట్టా చేయించారు. ఇచ్చిన భయాన డబ్బులు తిరిగి ఇవ్వకుండా, భూమి పట్టా చేయకుండా మోసం చేసినందుకు గాదె లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు ముగ్గురి నిందితుల పైన చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని, సామాజిక దురాచారమని గ్రామప్రత్యేకాధికారి, డాక్టర్ మనీషాపటేల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా అన్నారు. బాల్య వివాహాల వ్యతిరేక నిర్మూల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించినంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సున్న బాలికలు, 21 సంవత్సరాల కన్నా తక్కువ ఉన్నా బాలురలకు వివాహం చేయరాదన్నారు. మైనర్‌గా ఉన్నప్పుడే వివాహం చేయటం వల్ల తనకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం కోల్పోతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, డాక్టర్ మనీషాపటేల్, పంచాయతీ కార్యదర్శి రవి, అంగన్‌వాడీ టీచర్లు దీప, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చౌలమద్దిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా

ప్రజాపాలన విజయోత్సవాలపై అవగాహన

కొడిమ్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడి బజారుతో పాటు నాచుపల్లి, హిమ్మతురావుపేట గ్రామంలో ప్రజాపాలన విజయోత్సవాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బుధవారం అవగాహన కలిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ కళాకారులు ప్రజలను చైతన్యపర్చడంలో ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సలీం, కార్యదర్శులు, కళాకారులు పర్షరాములు, మహిపాల్, రాజేందర్, ప్రవీణ్, అశోక్, రాజ్‌కుమార్, సురేష్ నాయక్, రమ్య, రాజేశ్వరీ, పోచయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్యక్రమంలో కొందరు ప్రజలు కాంగ్రెస్ హామీలు ఎమయ్యాయని, నాయ కులను నిలదీసారు. రైతు బంధు, తులం బంగారం ఏ మైదంటూ నిరసన వ్యక్తం చేశారు.


అవగాహన కలిపిస్తున్న కళాకారులు

సర్వేకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలను అమలు చేయడం సులభతరం అవుతుందన్నారు. గత ప్రభుత్వం కేవలం తమకు నచ్చిన వారికే ప్రభుత్వ పథకాలను అందిస్తూ అధికార దుర్వినియోగనికి పాల్పడ్డారన్నారు. ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం

జగిత్యాల అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాలలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్ సూట్ డీలర్స్ కోర్సులో గోల్డ్ మెడల్ సాధించిన సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన సాయిని తిరుపతిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభ్యుదయ రైతు వ్యవసాయ మార్కెటింగ్ కోర్సు నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గుర్రాల రాజేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్, వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్ పాల్గొన్నారు.

సౌదీలో గుండెపోటుతో మృతి

కథలాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూషణరావు పేటకు చెందిన దీకొండ సురేశ్ (39) అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందినట్లు ఆలస్యంగా తెలిసింది. టేలర్‌గా పనిచేస్తున్న సురేశ్ ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురికావడంతో మృతి చెందినట్లు తెలిసింది. సురేశ్ కొంత కాలంగా సౌదీకి ఉపాధి నిమిత్తం వెళ్తన్నాడు. మరణవార్త తెలిసిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహం గురువారం స్వగ్రామం చేరుకుంటున్నట్లు సమాచారం.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

భీమారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాల, మాల ఉప కులాల ఆత్మ గౌరవ సభ వాల్ పోస్టర్‌ను మం డలంలోని గోవిందారం గ్రామంలో అంబేద్కర్ సంఘ నాయకుడు నెల్లుట్ల ప్ర భాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణలో ఉండే మాలలు, మాల ఉప కులాలు ఈ సభకు భారీగా తరలివెళ్లి సభను విజయ వంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దయ్య గోపి, బిటుకు రవీందర్, బింగి లచ్చయ్య, గుర్రపు లచ్చయ్య, నెల్లుట్ల శ్రీను, ఏనుగుల శంకర్, రుద్రంగి రాజేశం, స్వామి, గోకలి గంగారాం, పోచయ్య, బండి రెడ్డి, వెంకట నర్సయ్య, తలారి నర్సయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి లక్ష్మీ గణేష్ మాడ్రన్ పారాబాయిల్డ్ రైస్‌మిల్‌లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పెండ్యాల రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రైస్‌మిల్ యజమానులు ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు-రమాదేవి, లోహిత్‌రావు-సారిక దంపతులు దీపాలు, వత్తులు వెలిగించి కార్తీక దామోదరుడిని భక్తి శ్రద్ధలతో పూజించారు. అనంతరం 200 మంది బ్రాహ్మణ దంపతులకు కార్తీక వన భోజనం ఏర్పాటు చేశారు. రైస్‌మిల్ యజమానులు వారందరికి కట్న కానుకలు సమర్పించారు.

వేసవిలో విద్యుత్ సరఫరాకు కార్యాచరణ

● జిల్లా ఎస్ఈ శాలియానాయక్

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 27 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు జిల్లాల్లో కార్యాచరణతో ప్రణాళికను అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఈ శాలియానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని 33 కేవి ఫీడర్ నుంచి చౌలమద్ది సబ్‌స్టేషన్ వరకు రూ. 25 లక్షలతో నిర్మించనున్న అంతర్గత, ప్రత్యామ్నాయ లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి జిల్లాల్లో 12 అంతర్గత, ప్రత్యామ్నాయ 33కేవీ లైన్లను మంజూరు చేయడంతో నిధులను కేటాయించారన్నారు. ఇందులో భాగంగా చౌలమద్దిలో ఒకటి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇది జిల్లాల్లోనే మొదటి లైన్ కావడం, రికార్డు సమయంలోనే పూర్తి చేయుటకు కృషి చేసిన స్థానిక అధికారులు, సిబ్బందిని అభినందించారు. మెట్‌పల్లి డివిజన్‌లో చేపట్టిన మరో నాలుగు ఫీడర్ల టెండర్లు పూర్తియై నిర్మాణ దశలో ఉన్నయన్నారు. మెట్లచిట్టాపూర్ నుంచి నిజామాబాద్ జిల్లాలోని చౌట్‌పల్లికి వరకు వేసే లైన్ వ్యూహాత్మకంగా నిలుస్తుందన్నారు. లైన్‌లను కాంట్రాక్టర్లు జనవరి ఆఖరు వరకు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ దురిశెట్టి మనోహర్, ఏఈలు అజయ్, అమరేందర్, రవి, ప్రదీప్, సబ్ ఇంజనీర్లు నవీన్, రమేష్, సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.


జగ్గసాగర్‌లోని విద్యుత్ లైన్ ప్రారంభిస్తున్న ఎస్ఈ శాలియానాయక్

29న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 29 న శుక్రవారం 18 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భీమనాతి మంగ-అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం అయ్యప్ప దీక్షా పరులు లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం నుంచి గోదావరి నది వరకు శోభా యాత్ర నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం గోదావరి నదిలో అయ్యప్పకు ఆరట్టు జరిపి తిరిగి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.

తదుపరి మూల విరాట్టుకు క్షీరాభిషేకం, పడి పూజ, బిక్ష ఉంటుందని వివరించారు. సమస్త భక్తులు అందరు పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ నెల 28 ఆలయంలో గణపతి సహస్రావర్తన, గణపతి హోమం ఉంటుందని తెలిపా రు.

మల్లికార్జున స్వామి జాతరకు ఏర్పాట్లు చేయాలి

● ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి

గొల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 6 నుంచి జరగనున్న మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం మల్లన్న పేట మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని ఎస్సైలు చిర్ర సతీష్ కుమార్, మాడ శ్రీధర్ రెడ్డిలతో కలిసి సీఐ పరిశీలించారు. ఆలయ పరిసర ప్రదేశాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాలను గుర్తించి జాతర నిర్వాహకులకు సూచనలు చేశారు. భక్తులకు ఏలాం టి అసౌకర్యాలు కల్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భక్తులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని, జాతరలో ఏలాంటి దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, మాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి నర్సయ్య, భేర కిషోర్, నాయకులు సిద్దంకి మల్లయ్య, ఆలయ పౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య సీఐ, ఎస్సైలను సన్మానించారు.


ఆలయం ప్రాంగణంను పరిశీలిస్తున్న సీఐ

నిధులు కాజేసినందుకే కార్యదర్శి సస్పెన్షన్

మల్లాపూర్, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని రాఘవు పేట గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులను సంబంధించిన అధికారి సంతకం ఫోర్జరీ చేసి నిధులు కాజేసిన పంచాయతీ కార్యదర్శిని జిల్లా ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేయడం మండలంలో చర్చనీయంశంగా మారింది. రాఘవుపేట గ్రామంలో సీసీ రహ దారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ. 5లక్షలు మంజూర య్యాయి.

ఆరహదారులను స్థానికులు నిర్మించారు. వీటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో బాధితులు అధికారులు పరిశీలించగా నిధులు డ్రాఅయినట్లు గుర్తించారు. విషయం ఉ న్నతాధికారుల దృష్టికి వెళ్లగా ప్రత్యేక అధికారి సంతకా న్ని ఫోర్జరీ చేసి రూ. 5లక్షలను డ్రా చేసి పంచాయతీ కార్యదర్శి వాడుకున్నట్లు గ్రహించారు. విచా రణ జరిపిన అధికారులు నిధులపట్ల నిర్లక్ష్యం వహించిన స్థానిక పం చాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. స్వంతంగా వాడు కున్న డబ్బుల నుంచి సగం సొమ్మును రికవరీ చేసినట్లు మండల అధికారులు పేర్కొన్నారు. మిగిలిన సొమ్మురా వాల్సి ఉందన్నారు.

సంక్షిప్త సమాచారం

కోరుట్ల: పోగోట్టుకున్న ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వార రికవరీ చేసినట్లు ఎస్ఐ రామచంద్రం బుధవారం తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన అబ్దుల్ జావీద్ సెప్టెంబరు 28వ తేదీన పట్టణ శివారులో తన ఫోన్ పోయినట్లు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయ్యగా పోర్టల్ సహాయంతో ఫోన్ రికవరీ చేసినట్లు ఎస్ఐ రామచంద్రం తెలిపారు. రికవరీ చేసిన ఫోన్‌ను ఎస్ఐ రామచంద్రం బాధితుడు అబ్దుల్ జావీద్‌కు అందజేశాడు.

గొల్లపల్లి : శాంతిభద్రతల దృష్ట్యా మండలంలోని వివిధ ప్రార్థణ మందిరాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చిర్ర సతీష్ కుమార్ మందిరాల అధ్యక్షులకు సూచించారు. బుధవారం ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గొల్లపల్లి పోలీసు స్టేషన్‌లో మందిరాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ మందిరాల్లో ఎటువంటి దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని, అందులో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ప్రార్థణ మందిరాల పరిసరాలలో ఎటువంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని, ఎవరైన నిబంధనలను ఉల్లంఘిస్తే వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చెక్కపల్లి హరీశ్ గ్రామంలోని జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. ఈ మేరకు తొమ్మిది మంది విద్యార్థులకు అందించి క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర, జతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చాటాలని సూచించారు. హెచ్‌ఎం గౌతమ్‌కృష్ణ, పీడీ గంగసాగర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్ : మండల కేంద్రంలోని మాస్టో పాఠశాల విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్సై నవీన్ చట్టాలపై అవగాహన కల్పించారు. కేసు నమోదైన సందర్భంలో ఎఫ్‌ఐఆర్ చేసే పద్ధతి, పోక్సో చట్టంపై వివరించారు. లాకప్‌లను విద్యార్థులకు చూపించారు. విద్యార్థినులు ధైర్యం గా ఉండాలని ఆత్మ రక్షణ చర్యల గురించి చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ మధుకర్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ 2023-24కు గాను అత్యుత్తమ బ్యాంక్‌గా ఎంపిక కావడంపై ఇబ్రహీం పట్నం కేడీసీసీ బ్యాంక్‌లో బ్యాంక్ అధికారులు సంబరాలు జరుపుకున్నారు. బ్యాంక్‌లో అధికారులు కేక్ కట్ చేశారు. బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.